ప్రజాశక్తి
బుధవారం 25 సెప్టెంబర్ 2024 5
శ్రీ సత్యసాయి



సీడాఫ్ చైర్మన్‌గా దీపక్‌రెడ్డి

◆ మరో నలుగురికి సభ్యులుగా అవకాశం
◆ నామినేటెడ్‌లో ఆశావహులకు నిరాశ


దీపక్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎట్టకేలకు నామినేటెడ్ పదవుల నియామకాలు జరిగాయి. మొదటి విడతలో అనంతపురం జిల్లాకు ఒక చైర్మన్, నలుగురికి సభ్యులుగా చోటు దక్కింది. మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి నామినేటెడ్ పదవి దక్కింది. మరిన్ని కమిటీల్లో సభ్యులుగా నలుగరిని నియమించింది. సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఎపి) ఛైర్మన్‌గా దీపక్‌రెడ్డిని నియమించారు. రాయదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జీగా ఉన్న దీపక్‌రెడ్డి ఉన్న సమయంలో 2014లో ఎమ్మెల్యేగా టిడిపి అధిష్టానం టిక్కెట్టు ఇవ్వలేదు. ఆ స్థానంలో కాలవ శ్రీనివాసులకు ఇచ్చారు. తిరిగి 2019, 2024 ఎన్నికల సమయంలోనూ కాలవ శ్రీనివాసులుకే ఇచ్చారు. ఈ సమయంలో స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా దీపక్‌రెడ్డికి పదవినిచ్చారు. అది పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు ఆయనకు సీడాప్ ఛైర్మన్ పదవిని ఇచ్చారు.

మరో నలుగురు సభ్యులు

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి నలుగురు సభ్యులకు వేరువేరు కమిటీల్లో సభ్యులుగా నియమితులయ్యారు. ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్టర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా ధర్మవరం టిడిపి నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, పుట్టపర్తి నియోజకవర్గం నుంచి భూక్య కాలే నాయక్‌ను నియమించారు. ఎపి మార్కెట్ కమిటీలో సభ్యుడిగా కెసి.హరి, ఎపి సీడ్ కార్పొరేషన్ సభ్యులుగా హిందూపురం అసెంబ్లీ నియజకవర్గంలో కమతం కాటమయ్యలను నియమించారు.

ఆశావహుల్లో నిరాశ

నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకుని దక్కని వారిలో నిరాశే ఎదురైంది. గత ఎన్నికల సమయంలో టిక్కెట్టు ఆశించి దక్కనివారు, పార్టీ కోసం పనిచేసిన వారు పెద్దఎత్తున నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టికున్నారు. మొదటి జాబితాలో కేవలం ఒక్కరికి మాత్రమే నామినేటెడ్ ఛైర్మన్ పదవి దక్కింది. దీంతో ఇప్పటి వరకు పదవులొస్తాయని ఆశించిన వారిలో తీరని నిరాశే మిగిలింది. ప్రధానమైన కార్పొరేషన్ల అన్నింటినీ ప్రభుత్వం భర్తీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లోనే ఐదుగురికి టిక్కెట్టు దక్కని సీనియర్లు ఉన్నారు. వారు కూడా ఈ పదవుల్లో తమకు తగిన ప్రాధాన్యత లభిస్తుందని భావించారు. కాని వారెవరికీ చోటు లేకపోవడంతో నిరాశలోనున్నారు.

రథానికి నిప్పు

◆ మంటలను ఆర్పిన గ్రామస్తులు
◆ అనంతపురం జిల్లా హనకనహాల్‌లో ఘటన
◆ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ


కాలిపోయిన రథం


మంటల్లో కాలిన రథం ముందు భాగం

ప్రజాశక్తి -కణేకల్లు

అనంతపురం జిల్లా కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి రామాలయం రథానికి మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనతో గ్రామంలో కాస్త అలజడి నెలకొంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హనకనహాల్ గ్రామంలో రాముడు, ఆంజనేయస్వామి దేవాలయాలు ఉన్నాయి. ఇందులో దేవాదాయ పరిధిలో ఒక ఆలయం ఉండగా, మరొక ఆలయం ప్రయివేటు వ్యక్తుల నిర్వహణలో ఉంది. ఈ ఆలయాలకు సంబంధించి ఓ రథాన్ని అదే గ్రామానికి చెందిన ఒక కుటుంబ సభ్యులు 2022 సంవత్సరంలో రూ.18 లక్షల సొంత నిధులతో తయారు చేయించి ఇచ్చారు. అప్పటి నుంచి మూడు సంవత్సరాలు పాటు శ్రీరామనవమి సందర్భంగా రథోత్సవం వేడుకలను నిర్వహించారు. రథోత్సవం అనంతరం గ్రామంలోని ఆలయం వద్ద రథాన్ని ఉంచేందుకు ప్రత్యేకంగా ఓ షెడ్డును ఏర్పాటు చేసి అందులోనే రథాన్ని ఉంచేవారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి రథానికి నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. దట్టమైన మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు గుర్తించి వెంటనే ఆర్పివేశారు. అప్పటికే రథం ముందుభాగం కొంత కాలిపోయింది. ఏదైనా ప్రమాదవశాత్తు రథానికి మంటలు వ్యాపించాయా..? గ్రామంలో అలజడి సృష్టించేందుకు రథానికి గుర్తు తెలియిన వ్యక్తులు నిప్పుపెట్టారా..? గ్రామంలో నెలకొన్న ఘర్షణల కారణంగా ఈ ఘటన జరిగిందా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన

రథానికి నిప్పుపెట్టిన విషయం తెలుసుకున్న అనంతపురం కలెక్టర్ డా॥వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, ఆర్డీవో రాణి సుస్మిత, రూరల్ సిఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు తహశీల్దార్ ఫణి కుమార్‌లతో కలిసి హనకనహాల్ గ్రామంలో పర్యటించారు. నిప్పుపెట్టిన రథాన్ని పరిశీలించారు. అక్కడే ఆలయం వద్ద గ్రామస్తులతో ఘటనకు సంబంధించి వివరాలను సేకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రథానికి మంటల్లో కాలిన ఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. ఇందుకు కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కావాలనే ఎవరైనా రథానికి నిప్పుపెట్టి ఉంటే వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.

ఘటనపై సమగ్ర విచారణ చేయాలి : సిపిఎం

హనకనహాల్ గ్రామంలో రామాలయ రథం కాలిపోయిన సంఘటనపై సమగ్ర విచారణ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ఓ ప్రకటనలో కోరారు. సోమవారం అర్ధరాత్రి రథంకు మంటలు వ్యాపించినట్లు గ్రామస్తులు చెబుతున్నా రన్నారు. ఈ ఘటనకు ఎవరైనా పాల్పడి ఉంటే నిందితులను త్వరితగతిని పట్టుకోవాలన్నారు. ఈలోపు ఘటనపై దుష్ప్రచారాలు చేసే శక్తులు, వ్యక్తులను నియంత్రించాలని ఆయన కోరారు. ఎలాంటి ఉద్రిక్తతలకు లోనుకాకుండా ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు.


కాలిపోయిన రథాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఎలాంటి రాజకీయం లేదు : ఎమ్మెల్యే కాలవ

హనకనహాల్ గ్రామంలో రథం కాలిపోయిన ఘటనలో ఎలాంటి రాజకీయ కారణాలు లేవని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంటల్లో కాలిన రథాన్ని ఆయన పరిశీలించారు. ఘటనపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడామన్నారు. గ్రామస్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఈ ఘటనకు ఎవరైనా పాల్పడి ఉంటే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని అధికారులకు తెలిపామన్నారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

తలుపుల మండలంలో యుటిఎఫ్ సభ్యత్వ నమోదను మంగళవారం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు ఆజంబాషా, బ్రహ్మేంద్ర సంతోష్ ల ఆధ్వర్యంలో తలుపుల మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులచే సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలని, పిఆర్‌సిపై స్పష్టమైన ప్రకటన చేసి, ఐఆర్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.


ఆసుపత్రిలో వైద్య సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న బాధితురాలు

వైద్యం చేయమంటే దూషణలు

సోమందేపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ఓ ఉద్యోగి నిర్వాకం
బాధితుల ఆవేదన

ప్రజాశక్తి-సోమందేపల్లి

కూతురికి ఆరోగ్యం సరిగా లేక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన ఓ మహిళపై అక్కడి ఉద్యోగి దూషణలకు దిగినట్లు తెలుస్తోంది. 'చనిపోయే అవకాశం ఉంటేనే సెలైన్ బాటిల్ ఎక్కిస్తామని, మీ బిడ్డకు సీరియస్‌గా ఉంటే ఏదైనా ప్రయివేటు ఆస్పత్రికి తీసుకువెళ్లండి' అంటూ మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న మధు అనే ఉద్యోగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారంటూ బాధితులు తెలియజేశారు. చికిత్స అందించమని కోరినందుకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని తెలిపారు. బాధితులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా మంగళవారం నాడు చికిత్స నిమిత్తం బాలిక తల్లి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లింది. బాలిక చాలా నీరసంగా ఉందని ఇంజెక్షన్ ఇచ్చి, సెలైన్ బాటలో ఎక్కించాలని వైద్య సిబ్బందిని బాలిక తల్లి కోరింది. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఆసుపత్రి క్లర్క్ మధు ఆయన చేస్తున్న విధులను మరచి చికిత్స నిమిత్తం వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చనిపోయే అవకాశం ఉన్న వ్యాధి ఉంటేనే సెలైన్ బాటిల్ ఎక్కిస్తామని మిగితా వారికి సెలైన్ ఎక్కించం' అంటూ పరుష పదజాలంతో దూషించాడు. మంచి వైద్యం కావాలంటే ఏదైనా ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లాలంటూ ఉచిత సలహా కూడా ఇచ్చాడు. తోటి సిబ్బంది ఎంత నచ్చుజెప్పినా వినకుండా ఆయన వినకుండా ఇష్టం వచ్చినట్లు బూతులు తింటాడని బాధితులు తెలియజేశారు.

గతంలోనూ ఈయనపై ఆరోపణలు

ఆసుపత్రి క్లర్క్ మధుపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలే ఉన్నాయి. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో రోగులను ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆయన్ను సోమందేపల్లికి బదిలీ చేశారు. ఇక్కడ కూడా ఆయన అదే విధంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు నిత్యం విన్పిస్తున్నాయి. ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఇతర ఆసుపత్రి చిరుద్యోగులను తిడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలన్నీ ఉన్నతాధికారులకు తెలిసినా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు దష్టి సారించి రోగులు, చిరుద్యోగులపై ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యువత జీవితాల్లో మార్పు

జాబ్‌మేళాలో ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి యవత జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. మంగళవారం కదిరి పట్టణంలోని ఎస్‌టిఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం యువతి యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో వైఫల్యం చెందడంతో చదువుకున్న ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక వీధిన పడ్డారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16వేల పైచిలుకు ఉద్యోగుల భర్తీకి తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. స్థానిక నిరుద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని పరిశ్రమల వారితో మాట్లాడి నేడు జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారులు ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్మిత తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పాలసముద్రం నాసన్, బెల్ కంపెనీలకు భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ నిర్వాసిత రైతులతో మంగళవారం నాడు సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ నిర్వాసితుల్లో ఎక్కువ మంది దళిత, మైనారిటీ నిరుపేదలు ఉన్నారన్నారు. వీరందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావసం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి దీనిపై వినతులు అందిస్తూ, నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా పోలీసులు నిర్వాసితులపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి కనీసం సెక్యూరిటీ, వాచ్‌మెన్, స్వీపర్, హౌస్ కీపింగ్ వంటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోతున్నారని తెలిపారు. నిర్వాసితుల కష్టాలను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 7న విజయవాడ కమిషనరేట్ వద్ద వంటావార్పుతో 48 గంటల నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఇక పాలసముద్రం క్రాస్ నందు సర్వే నంబర్ 125లో గుడిసెలు వేసుకున్న పేదల నివాసాలకు పట్టాలిచ్చి విద్యుత్, నీటి వసతి కల్పించాలని వ్యకాసం, ఇళ్ల స్థలాల హక్కుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో కోరారు. ఈ సమస్యలపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్పందిస్తూ నాసన్, బెల్ కంపెనీ భూ నిర్వాసితుల సమస్యను వారం రోజుల్లోపు పూర్తిగా పరిశీలించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వెంకటేష్ సిపిఎం సీనియర్ నాయకులు రామకృష్ణ, ఆఫీస్ కార్యదర్శి సిద్ధు నాసన్, బెల్ భూ నిర్వాసితులు కమిటీ సభ్యులు వెంకటరామిరెడ్డి, వెంకట్రాముడు, అచ్చమ్మ, రమీజాబీ, గంగమ్మ, వెంకటలక్ష్మి నారాయణ పాల్గొన్నారు.


నిర్వాసితులతో కలిసి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

కో -ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో వెలుగు చూస్తున్న అక్రమాలు..!

◆ సెంట్రల్ స్టోర్ నిధులు రూ.24 లక్షల స్వాహా .!
◆ ఎన్‌పి.కుంట మండలంలో రూ.28 లక్షలు.. నల్లచెరువు ఎస్.మొలకలపల్లి సొసైటీలో రూ.32 లక్షలు గోల్‌మాల్
◆ ఉద్యోగుల అరియర్స్‌లోనూ చేతివాటం

కదిరి కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. రైతులు పంట పెట్టుబడి సాయం కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ సంఘాలను ఆశ్రయిస్తుంటారు. ఇలాంటి రైతులపై కనికరం చూపకుండా సొసైటీ డైరెక్టర్లు కుమ్మైకై పెద్ద ఎత్తున వారి డబ్బులు స్వాహా చేసేరనే అన్నదాతలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కదిరి సొసైటీ పరిధిలో 2022-23 ఏడాదిలో తీసుకున్న రుణాలకు సంబంధించి రెన్యూవల్ వడ్డీని రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అధికారులకు చెల్లించినట్లు తెలుస్తోంది. రైతులు డబ్బులను రైతులు చెల్లించినప్పటికీ సిబ్బంది బ్యాంక్‌లో జమ చేయకుండా చేతివాటం ప్రదర్శించినట్లు సమాచారం.



ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి డివిజన్‌లోని కదిరి రూరల్ మల్లయ్య గారి పల్లి 10, గొల్లోళ్లచెరువు, నల్లచెరువు ఎస్.మొలకల పల్లి 36, తలుపుల, నబులపులకుంట మండలంలో 28, గాండ్లపెంట మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పంట పెట్టుబడి కోసం రైతులు పంట రుణాలు తీసుకున్నారు. వారు తీసుకున్న పంట రుణాలకు సంబంధించి సకాలంలో సహకార సంఘాల్లో సిబ్బందికి అసలు, వడ్డీ చెల్లించారు. ఇక్కడే సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. రైతుల నుంచి తీసుకున్న సొమ్ముకు సంబంధించి రసీదు ఇచ్చి భూమికి సంబంధించిన కంప్యూటర్ పోర్టల్‌లో కేవలం కంటితుడుపుగా చూపించి ఆ మొత్తం బ్యాంక్‌కు చెల్లించకుండా వారే స్వాహా చేసేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది రైతులు బ్యాంక్‌లో రుణం మంజూరుకు వెళ్తే సహకార సంఘాల్లో రుణం బకాయి ఉన్నట్లు చూపించడంతో అన్నదాతలు ఖంగుతిన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించారు. అయితే ఈ విచారణ నామమాత్రంగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. పంట రుణాల రెన్యూవల్ కాకపోవడంతో ప్రభుత్వం ద్వారా రైతులకు అందించాల్సిన రాయితీలు అందకుండా పోతున్నాయి.

ఉన్నతాధికారులకూ చేయి తడపాల్సిందే..!

కదిరి కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో పనిచేసే కొందరు ఉద్యోగస్తులకు అరియర్స్ ఇతరత్రా వ్యవహారాల్లో జిల్లా స్థాయి అధికారులకు చేయితడపందే చెల్లింపులు కాని పరిస్థితి ఉన్నట్లు సమాచారం. చేయితడపకపోతే ఉద్యోగులకు అరియెర్స్, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ చెల్లించని పరిస్థితులు ఉన్నాయి.

బైలాలో లేని చట్టం అమలు.!

డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ ఆఫీసర్‌కు చేయి తడిపితే బైలాలో లేని చట్టాన్ని కూడా యథేచ్ఛగా అమలు చేస్తారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని మండలాల సీఈవోలు ఉద్యోగ విరమణ వయస్సు దాటినా వారి నుంచి ముడుపులు పుచ్చుకుని మరో రెండేళ్లు పొడిగించేలా నిర్ణయాలు చేసేశారు. కొత్తగా ఉద్యోగ నియామకాలు లేకపోయినా, కొన్ని మండలాల్లో అనధికారికంగా నియమించినట్లు తెలుస్తోంది. సొసైటీ అభివృద్ధి కోసం నిజాయితీగా కష్టపడి పని చేసే వారికి మాత్రం ఉద్యోగోన్నతులు నేటికీ దక్కని పరిస్థితి ఉంది.

ఎస్ఆర్‌లోనూ అవకతవకలు

సొసైటీలో సిబ్బంది విధుల హాజరుకు సంబంధించిన ఎస్ఆర్‌లోనూ అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. సెంట్రల్ స్టోర్‌కు సంబంధించి సొంత ఇంట్లో పని చేస్తున్న సిబ్బంది 24 లక్షల రూపాయల రికవరీ చేయకుండా రూ.18 లక్షలు మాత్రమే చూపించి రైతులకు సంబంధించిన డబ్బులు సొసైటీ సిబ్బంది అడ్డగోలుగా బొక్కేసినట్లు విశ్వసనీయ సమాచారం. వీటిన్నింటిపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే అవినీతి అక్రమాలు పెద్ద ఎత్తున బయటకు వస్తాయని రైతులు చెబుతున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. బాత్రూంలోనే నివాసం...

ఆదుకోవాలని ఓ పేద కుటుంబం వేడుకోలు

ప్రజాశక్తి - మడకశిర

గత వైసీసీ ప్రభుత్వ నిర్లక్ష్యం పుణ్యమా అని ఓ నిరుపేద కుటుంబం బాత్ రూంలోనే నివాసం ఉండాల్సిన దుస్థితి దాపురించింది. అందుకు సంబందించిన వివరాలు.. మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన నరసింహప్పకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులే వారి జీవనాధారం. ఈ కుటుంబానికి గతంలో ఇక్కడ ఇల్లు ఉండేది. వర్షాలకు ఆ ఇల్లు కూలిపోవడంతో నిలువ నీడలేకుండా పోయింది. మళ్లీ ఇల్లు కట్టుకునే స్థోమత లేని నరసింహప్ప కుటుంబం కూలిపోయిన ఇంటికి సంబంధించిన బాత్రూంలోనే నివాసం ఉంటోంది. 2022లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తిప్పేస్వామి గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో పర్యటించారు. బాత్రూమ్ లో నివాసం ఉంటున్న నరసింహప్ప కుటుంబ పరిస్థితి చూశారు. వెంటనే రెవెన్యూ, హౌసింగ్ అధికారులను పిలిపించి, ఇల్లు మంజూరుచేసి..ఇల్లు కట్టించి ఇవ్వాలని ఆదేశించారు. అయితే ఆయన ఆదేశాలు అమలు కాలేదు. దీంతో ఆరేళ్లుగా ఆ కుటుంబం బాత్రూంలోనే నివాసం ఉంటోంది. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతూ 2022లో వైసీపీ ఎమ్మెల్యే గడపగడపకు పేరిట వచ్చి అందరి ముందు గొప్పగా ఇల్లు మంజూరుకు అధికారు లను ఆదేశించడంతో ఎంతగానో సంతోషించామన్నారు. అప్పటి నుంచి రెండేళ్లపాటు ఇంటికోసం అధికారులు, సచివాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం కన్పించలేదని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని అని వేడుకున్నారు.

నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే రూ.20వేల తక్షణసాయం

నిరుపేద కుటుంబానికి గృహ నిర్మాణం చేపట్టే దాకా అద్దె ఇంట్లో ఉండాలని ఆ అద్దె తానే చెల్లిస్తానని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తెలిపారు. నిరుపేద కుటుంబం పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఆయన వెంటనే రూ. 20వేలను అందజేశారు. అనంతరం కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఆ నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని కోరారు.


బాధితులు ఆరేళ్లుగా నివసిస్తున్న బాత్రూం


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

డంపింగ్ యార్డు తరలింపులో 'ప్రజాశక్తి' కృషి అభినందనీయం


ప్రజాశక్తి
సోమవారం 17 జులై 2023 5
శ్రీ సత్యసాయి
కాలుష్య కుంపటిగా 'పురం' డంపింగ్‌యార్డు
పొగ, దుర్వాసనతో ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు
పట్టించుకోని పాలకులు, అధికారులు

2023 జులై 17న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డు తరలింపులో ప్రజాశక్తి దినపత్రిక చేసిన కృషి అభినందనీయమని పలువురు సామాజిక సేవకులు అన్నారు. పట్టణంలో ఉన్న డంపింగ్‌యార్డు కాలుష్య కుంపటిగా మారి, అహ్మద్ నగర్ ప్రాంత ప్రజలకు శాపంగా ఉంది. ఈ సమస్యను ప్రజాశక్తి దినపత్రిక 'కాలుష్య కుంపటిగా డంపిగ్ యార్డు' అనే కథనంతో సమస్యను వెలుగులోకి తీసుకోచ్చింది. ఆ సమయంలో గత ప్రభుత్వం డంపింగ్ యార్డు తరలించడానికి రూ. 5కోట్లు మంజూరు చేసింది. అయితే ఎన్నికలు రావడంతో ఈ పనులు ఎక్కడిక్కడ ఆగిపోయాయి. దీంతో సామాజిక ఉద్యమకారులు, డంపింగ్ యార్డుకు ఆనుకొని ఉన్న సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నఫీసా సుల్తానాలు పలుమార్లు అధికారులకు, పాలకులకు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికి అధికారుల్లో స్పందన రాలేదు. నిధులు మంజూరైన డంపింగ్ యార్డు తరలించ లేదు. దీంతో కొద్ది నెలల క్రితం సామాజిక సేవకురాలు, యువ న్యాయవాది సవేర రెహ్మాన్ డంపింగ్ యార్డు మార్చాలని న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. దీంతో అధికారుల్లో చలనం వచ్చి, డంపింగ్ యార్డు తరలింపునకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సామాజిక సేవకులు, న్యాయవాది నవేర రెహ్మాన్ మంగళవారం డంపింగ్ యార్డును తరలింపు పనులను పరిశీలన చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, దక్షిణ భారత హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మైనార్టీ నాయకులు భేజా రియాజ్, హెచ్ఎం నఫీసా సుల్తానలు సమస్యను వెలుగులోకి తీసుకోచ్చిన ప్రజాశక్తిని ప్రత్యేకంగా అభినందించారు. డంపింగ్ యార్డును 100 రోజుల్లో తొలగిస్తామని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అధికారులు తెలిపారన్నారు.

సామాజిక సేవకుల ప్రశంసలు

అభివృద్ధి పథంలో పరిగి

మంత్రి చొరవతో ఏళ్లనాటి సమస్యలు పరిష్కారం
రూ.4కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
నేడు మండలంలో పర్యటించనున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - పరిగి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిగి మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. మంత్రి సవిత చొరవతో ఎన్నో ఏళ్లనాటి సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి సవిత బుధవారం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.గతంలో పరిగి మండల వ్యాప్తంగా అభివృద్ధి ఆటకెక్కింది. సిసి రోడ్లు, డ్రైనేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి సవితమ్మ మండల వ్యాప్తంగా ప్రచారం చేసిన సందర్భంగా కొన్ని కాలనీలలో రోడ్లు లేక కాలనీవాసులు పడుతున్న సమస్యలను గుర్తించారు.ఆ సమయంలో మండలంలోని పి నరసాపురం పంచాయతీ ఎస్సీ కాలనీలో అమ్మవారు ఆలయాన్ని సందర్శించిన ఆమె ఆ కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి కాలనీలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు ఏర్పాటు చేసిన తర్వాతే గ్రామంలోకి వస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీలో రూ. 6లక్షల అంచనాతో సిసిరోడ్డు, డ్రయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన మంత్రి సవిత మండలంలో పర్యటించి మండల ప్రజల నుండి అనేక సమస్యలను అర్జీల ద్వారా స్వీకరించారు. ఆ సమస్యల పరిష్కారానికి నిధులు తీసుకురావడంలో విజయవంతం అయ్యారని చెప్పవచ్చు. తక్కువ సమయంలోనే అవసరమైన ప్రతిచోట డ్రైనేజీ నిర్మాణంతో పాటు రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యే విధంగా చొరవ చూపారు. ఈ పనుల కేటాయింపుతో నూరు రోజుల టిడిపి ప్రభుత్వా పనితీరుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మంత్రి సవిత

బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలోని ఎనిమిది పనులకు గాను రూ. 56 లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహిస్తుండగా పాత్రగానిపల్లిలో సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు, బీచిగానిపల్లి గ్రామంలో రూ.23.5లక్షలు, గొల్లపల్లిలో రూ.17.5 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మోదా పంచాయతీ పరిధిలో ఐదు అభివృద్ధి పనులకు రూ. 22 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మోదా గ్రామానికి సిసి రోడ్ ఏర్పాటుకు రూ.6 లక్షలు, గోరవపల్లిలో సి సి రోడ్డు నిర్మాణానికి రూ. 7 లక్షలు, ఎం చెర్లోపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 2 లక్షలు, పుట్టగుర్లపల్లిలో రెండు సిసి రోడ్ల నిర్మాణానికి రూ. 7 లక్షలు మంజూరయ్యాయి. అదేవిధంగా పొన్నంపల్లి పంచాయతీ గాను రెండు సిసి రోడ్ల నిర్మాణానికి 11 లక్షల రూపాయలు కేటాయిస్తున్నారు. శ్రీకంఠం పంచాయతీ పరిధిలో రెండు సిసి రోడ్ల నిర్మాణానికి రూ. 10 లక్షలు కేటాయించారు. పి నర్సాపురం పంచాయతీ పరిధిలో నర్సాపురం గ్రామంలో మూడు సిసి రోడ్ల నిర్మాణానికి గాను రూ. 21 లక్షలు కేటాయించారు. ఎస్ మదిరెడ్డిపల్లిలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ 6.5 లక్షలు కేటాయించారు. పరిగి పంచాయతీ వ్యాప్తంగా ఐదు సిసి రోడ్ల నిర్మాణాలకు రూ. 67 లక్షలు కేటాయించగా ఇందులో పరిగి గ్రామంలో ఒక సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 7 లక్షలు కేటాయించారు. బోరెడ్డిపల్లిలో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 52 లక్షలు కేటాయించారు. ఊటుకూరు పంచాయతీ గాను మూడు రోడ్ల నిర్మాణాలకు గాను రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో ఊటుకూరు గ్రామంలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. యు. బసవనపల్లి గ్రామంలో రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. 30 లక్షలు కేటాయించారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లి పంచాయతీ పరిధిలో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీరంగరాజుపల్లి గ్రామంలో ఒక రోడ్డు నిర్మాణానికి రూ. 4 లక్షలు కేటాయించారు, ముత్య మేకలపల్లి గ్రామంలో మూడు సిసి రోడ్ల నిర్మాణాలకు రూ. 10 లక్షలు కేటాయించారు. మండలంలోని ఎర్రగుంట పంచాయతీ పరిధిలో రెండు సిసి రోడ్ల నిర్మాణాలకు గాను రూ. 9 లక్షలు కేటాయించగా నేతల పల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 5లక్షలు, ఎర్రగుంట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు కేటాయించారు. సిగిపల్లి పంచాయతీ పరిధిలో మూడు సిసి రోడ్ల నిర్మాణానికి గాను రూ. 15 లక్షలు కేటాయించగా సిగిపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 6 లక్షలు, గణపతి పల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 9 లక్షలు కేటాయించారు. విట్టపల్లి పంచాయతీ పరిధిలో ఆరు సిసి రోడ్ల నిర్మాణాలకు రూ. 57 లక్షలు కేటాయించగా ఇందులో విట్టపల్లి గ్రామంలోనే ఈ ఆరు సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నారు. అదేవిధంగా కొడిగెనహళ్లి పంచాయతీ వ్యాప్తంగా ఏడు సిసి రోడ్ల నిర్మాణానికి రూ. 51 లక్షలు కేటాయించగా కొడిగెనహళ్లి గ్రామంలో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.23 లక్షలు, కాల్వపల్లి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ. 10 లక్షలు కేటాయించారు. ఇక పైడేటి పంచాయతీ గాను రెండు సిసి రోడ్ల నిర్మాణాలకు రూ. 10 లక్షలు కేటాయించి పనులు నిర్వహించనున్నారు. శాసనకోట పంచాయతీలో మూడు సిసి రోడ్ల నిర్మాణాలకు రూ. 10.5 లక్షల కేటాయించి పనులు ప్రారంభించనున్నారు.


డ్రయినేజీ లేక రోడ్డుపైన ప్రవహిస్తున్న మురుగునీరు


కంకర తేలిన బోరెడ్డిపల్లి రహదారి

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం



మండలంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోక ప్రతి కాలనీ అస్తవ్యస్తంగా తయారయింది. ఈ నేపథ్యంలో అభివృద్ధిని కోరుకున్న ప్రజలు టిడిపికి పట్టం కట్టారు. ని దృష్టిలో పెట్టుకునే మంత్రి సవితమ్మ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విజయవంతం అవుతున్నారు.

గోవిందరెడ్డి,
టిడిపి మండల కన్వీనర్

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యం. ఆ దిశగా మంత్రి సవితమ్మ అడుగులు వేయడం ఎంతో శుభ ససూచకం. ఎన్నికల ప్రచార సమయంలో పరిగి మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి కాలనీలో ప్రజలతో మమేకమై ప్రతి ఇంటిని తిరిగిన సవితమ్మ వారి సమస్యలను చూసి అవసరమైన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

సూర్యనారాయణ,
మాజీ జెడ్పిటిసి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రొద్దం

కర్నాటక రాష్ట్రం పావగడ సమీపంలోని తిమ్మానాయుడు పేట వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురు ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదం లో మండలంలోని కొగిర గ్రామానికి చెందిన కంసాల రాజు (32)అక్కడికక్కడే మృతిచెందాడు. రొద్దం గ్రామానికి చెందిన విఆర్ఓ శంకరప్ప కుమారుడు మారుతి తీవ్రంగా గాయపడ్డాడు.

కోడిపందేల శిబిరంపై దాడులు

ప్రజాశక్తి- ముదిగుబ్బ

పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్ఎస్పి కొట్టాల సమీపంలో గల మద్దిలేరు వాగు వద్ద కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై పట్నం పోలీసులు దాడులు నిర్వహించారు. కోడిపందాలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారి నుండి రూ,15,830 నగదు, రెండు కోళ్లు, 6 కత్తులు స్వాధీనం చేసుకొని జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్యాంరావు, పట్నం ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

భర్త పై దాడి చేసిన భార్యతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని కాలేజ్ సర్కిల్ లో మెడికల్ షాపు నిర్వహిస్తున్న మహిళ మరొక వ్యక్తితో సన్నిహితంగా ఉన్నదన్న అనుమానంతో ఆమె భర్త ప్రశ్నించాడు. దీంతో ఆమె మరో వ్యక్తి కలిసి భర్తపై దాడి చేసింది. దీంతో బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు బాధితుడి భార్యతో పాటు ఆమెకు సహకరించిన వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - మడకశిర

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆర్డీటీ మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం మండలం పరిధిలోని గుండుమల గ్రామంలోని కెజిబివిలో ఆర్డిటి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బాలికలను రక్షిద్దాం -బాలికలను చదవనిద్దాం"అనే కార్యక్రమం ఆర్ డి టి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ సి డి ఎస్ సూపర్వైజర్ లీలావతి, మండల విద్యాధికారి శ్రీనివాస్ భాస్కర్ హాజరయ్యారు. ఈసందర్భగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని మండలంగా మడకశిర మండలాన్ని తయారు చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి కౌన్సిలర్ బ్రాహ్మణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి, కెజిబివి ఎస్ఓ విజేత, ఉపాధ్యాయులు సుజాత,రాధా, రేఖ, లలిత, అనిత తదితరులతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ దీక్షకు కదిరి జనసేన సంఘీభావం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం పట్టణంలో జనసేన స్థానిక నాయకులు సంఘీభావం తెలిపారు. ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ప్రాంగణంలో జనసేన పార్టీ ఇంచార్జీ భైరవ ప్రసాద్ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ధర్మదీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్, లక్ష్మణ్ కుటాల, అనురాధ, షమీమ్, పొరకాల రాజేంద్ర,గణేష్ నాయక్,అరవింద్, రవికుమార్, చౌదరి, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో హరీష్ స్కూల్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటారు. కదిరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించారు. ఖోఖో పోటీల్లో నవ్య, జాహ్నవి, నీలకంఠ, నారాయణ స్వామి, అప్సాన మదిహ, షటిల్ లో సింధు, యోషిత, రూపశ్రీ, చరణ్ కుమార్, కౌశిక్, జశ్వంత్, వాలీబాల్లో అంజేశ్వర్, వినయ్, జయచంద్ర, షాట్పుట్, డిస్క్ త్రోలో డి. అంజేశ్వర్, 100 మీటర్ల పరుగుపందెంలో జాహ్నవి, నారాయణ స్వామి, అంజేశ్వర్, సాయి గణేష్, 400 మీటర్ల పరుగుపందెంలో సాయి గణేష్, యోగాలో చరణ్ నాయక్, యువరాజ్ ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపల్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్ వలీ, ప్రసన్నకుమార్ తెలిపారు. వీరు బుధవారం జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.


ప్రతిభా విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

కంకర ఫ్యాక్టరీ నిర్వహణపై విచారణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని పాపిరెడ్డి పల్లి చెరువులో గల కంకర క్వారీని ఇన్ఛార్జి తహశీల్దార్తో పాటు ఎస్ఐ రమేష్బాబు పరిశీలించారు. కంకర ఫ్యాక్టరీ వల్ల నష్టపోయిన ఆరు గ్రామాల ప్రజలు ధర్నా చేసి మంత్రికి వినతిపత్రం విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం ఫ్యాక్టరీ సందర్శించి అక్కడున్న రికార్డులు తదితర విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు నాగరాజ్, సర్వేర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

క్రీడల్లో క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో నియోజకవర్గస్థాయి అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప, రాష్ట్ర రైతు కార్యదర్శి కేఎన్ పల్లి సురేష్, తెలుగు రైతు కార్యదర్శి మారుతి ప్రసాద్, ఆసుపత్రి కమిటీ మెంబర్ డాక్టర్ కృష్ణమూర్తి హాజరయ్యారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

హాస్టల్ భవనాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు గీతాంజలి సమీపంలో గతంలో నిర్మించిన బీసీ హాస్టల్ బవనాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నిర్మల జ్యోతి మంగళవారం పరిశీలించారు. బీసీ హాస్టల్ కు నిర్మించిన బిల్డింగ్ పనులు సరిగా లేనందున అప్పటి కలెక్టర్ హాస్టల్ ప్రారంభానికి అంగీకరించలేదు. దీంతో వైసిపి చెందిన సెక్సావలి ఆ బిల్డింగును ఆక్రమించుకొని పశువులు మేపుకుంటూ ఉండేవాడు ఇటీవల కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాస్టల్ భవనాన్ని పరిశీలించి పనులు చేపట్టి వాటి ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్పందించిన అధికారులు మంగళవారం హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. విషయాలను తెలుసుకున్నారు అప్పట్లో ఎస్సీ హాస్టల్ లో విద్యార్థులు సంఖ్య లేనందువలన జిల్లాలోని పలు హాస్టల్లో మూసి వేశారు.. దీంతో బీసీ హాస్టల్ విద్యార్థులు ఎస్సీ హాస్టల్లోకి వెళ్లారు, అప్పటినుంచి ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్ భవనాన్ని గతంలో విరాళం ఇచ్చిన దాత తన స్వాధీనం చేసుకున్నాడు ఈ విషయంలో సంబంధిత మండల టిడిపి నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆ ఆ బీసీ హాస్టల్ నిర్మాణాన్ని పునర్నిర్మించి పదిమందికి ఉపయోగపడే విధంగా దానిని తీర్చిదిద్దుదామని హామీ ఇచ్చాడు. దీంతో అధికారులు స్థల దాతకు విషయాన్ని మంగళవారం వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుపతి బాలాజీ, తహశీల్దార్ రవికుమార్, ఆర్ఐ అశోక్, హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

తనకల్లు ఎస్ఐగా గోపీ

ప్రజాశక్తి - తనకల్లు

తనకల్లు ఎస్ఐగా గోపీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని మీర్జాపురం అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఐసీడీఎస్ అధ్వర్యంలో నిర్వహించిన పౌష్టిక ఆహారం వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, సిడిపిఒ, సూపర్వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 'ఎంజెపి' విద్యార్థులు

రొద్దం : జిల్లా స్థాయి ఆటల పోటీలకు రొద్దం ఎం జె పి విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పెనుగొండ నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు పరిగి మండలం కొడిగిన హళ్లిలో ఏపీ ఆర్ ఎస్ స్కూల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న రొద్దం ఎం జె పి విద్యార్థులు ప్రతిభ కనపర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఉత్తమ ర్యాంకులతో గుర్తింపు

హిందూపురం : విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తే విద్యార్థులతో పాటు కళాశాలకు, కన్న తల్లిదండ్రులకు మంచి గుర్తింపు లభిస్తుందని, ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని డిఐఇఒ రఘునాథ్ రెడ్డి విద్యార్థినులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో రికార్డులను, అధ్యాపకుల హాజరు పట్టికలను పరిశీలన చేశారు. అనంతరం నాడు-నేడు కింద చేపట్టిన పనులను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

కదిరి టౌన్ : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ అన్నారు. స్వచ్ఛత హి సేవ లో భాగంగా పరిసరాల పరిశుభ్రత పై మంగళవారం కదిరి పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆర్టీసీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు ఎక్స్ప్రెస్, పల్లెవెలుగు రూట్లలో అత్యధిక డీజిల్ అక్యూపెన్సీ సాధించిన పలువురు సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం గ్యారేజీలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హరిత, ఎన్ఎంయు యూనియన్ నాయకులు బైరిశెట్టి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆర్ ఎస్ రెడ్డి, డ్రైవర్లు మెకానికల్ సిబ్బంది పాల్గొన్నారు

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : టిడిపి

పెనుకొండ : రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని తెలుగుదేశం నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీ, బిటి ఆర్ కాలనీ, మారుతి నగర్లో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరైయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జప్రల్లా ఖాన్, కురుబ రామాంజనేయులు, అస్లాం , సలీం,పులుగూర శ్రీనివాసులు,కురుబ నంజుండ, బోయ నంజుండ, నరేంద్ర తదితరులతో పాటు సచివాలయం, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సవిత మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె మంగళవారం ప్రారంభించారు. మొదట మల్లాపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు దాతలు పెయ్యాల వెంకట రెడ్డి,మహమ్మద్,నరేష్ అందించిన 142 యూనిఫామ్లు, 22 సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు.అదేవిధంగా మందలపల్లి పంచాయతీ మేరెడ్డి పల్లికి యర్రయ్యగారి పల్లి నుండి రూ. 1.44 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ. 22 లక్షల వ్యయంతో చేపట్టిన యర్రయ్యగారి పల్లి లోని సిసి రోడ్డు, పాఠశాల ప్రహరీ పనుల ప్రారంభ శిలపలకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా, ఇన్ఛార్జి తహశీల్దార్ రెడ్డి శేఖర్,ఎం ఇఒ గోపాల్, ట్రాన్స్కో ఎఇ బాలకృష్ణ నాయక్, టిడిపి మండల కన్వీనర్ సోముశేఖర్, నిమ్మల శ్రీధర్, మాజీ సర్పంచి సుధాకర్ రెడ్డి, నాయకులు అశ్వర్థరెడ్డి, కక్కల రఘునాథ్ రెడ్డి, కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం

గోరంట్ల : టిడిపి ప్రభుత్వంలో రాష్ట్రం సంక్షేమం అభివద్ధి వైపు అడుగులు వేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె. పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాపిరెడ్డి పల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సవిత ఎంపీ పార్థసారథి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రం సంక్షోభం నుండి సంక్షేమ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి చేశారన్నారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం గోరంట్ల మండలానికి సాగునీరు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు.కష్టపడిన నాయకులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణ చౌదరి, అశ్వర్థ రెడ్డి, కొత్తపల్లి నరసింహులు, ఈడిగ రవి, భూపాల్ రెడ్డి, డీలర్ శ్రీనివాసులు, నటరాజ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథి

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం : ఎమ్మెల్యే కందికుంట


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

గత ప్రభుత్వ హాయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ లే అవుట్లతో మున్సిపల్, పంచాయతీ ఆదాయానికి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గండి కొట్టారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కదిరి పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ముసుగులో మున్సిపల్ నుండి ఎలాంటి అనుమతులు పొందకుండా విచ్చల విడిగా వెంచర్లు వేసి అమాయక ప్రజల నుండి లక్షలాది రూపాయలు దండుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లపై దృష్టి సారించామని చెప్పారు. అందులో భాగంగా పట్టణం నలు వైపులా అనుమతులు లేని వెంచర్లను తొలగించామని ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపు చర్యలు లేవని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ లేఅవుట్లు వేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్న రియల్ వ్యాపారులకు ఒక అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసి అప్రూవల్ కి సహకరించమంటే కుదరదని పట్టా భూమిలో వేసిన అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముందుకు వస్తే తనవంతుగా సహకరిస్తామని చెప్పారు. భవిష్యత్ లో అనధికార లేఔట్ లు ఎవరు వేసిన చూస్తూ ఊరుకోమని అలాంటి వాటిని రిజిస్టర్ చేయకుండా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.

ప్లాస్టిక్ వినియోగంతో ప్రమాదం

జెవివి జిల్లా కార్యదర్శి హరి

ప్రజాశక్తి- పెనుకొండ టౌన్

ప్లాస్టిక్ వినియోగం మానాలని, పర్యావరణాన్ని కాపాడాలని జెవివి జిల్లా కార్యదర్శి హరి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురం ఎంపిపి పాఠశాలలో పర్యావరణం సబ్ కమిటీ (జనవిజ్ఞాన వేదిక) ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ అధ్యక్షతన ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం పర్యావరణానికి, భూమికి, నష్టం జరుగుతుందన్నారు. రక రకాలుగా ప్లాస్టిక్ వాడటం వలన, క్యాన్సర్ వ్యాధి బారిన పడే అవకాశం ఉండనిచెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులకు బట్ట బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ లక్ష్మీబాయి, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.


గుడ్డ సంచులు అందజేస్తున్న నాయకులు

నివాస స్థలాల హక్కు కల్పించండి

ఆర్డీవోకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్ నందు ఇల్లు లేని నిరుపేదలకు నివాస స్థలాల హక్కు కల్పించాలని సిఐపెం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు మంగళవారం అందజేశారు. పాలసముద్రం సమీపంలోని సర్వే నంబర్ 125 లో ఇల్లు లేని పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నారన్నారు. వారిని చట్టబద్ధ హక్కుల కల్పించి విద్యుత్, నీటి సౌకర్యం కోసం సంబంధిత అధికారులకు ఆదేశించాలని కోరారు. స్పందించిన ఆర్డిఒ. భాగ్యరేఖ మాట్లాడుతూ అర్హులందరికీ పై అధికారుల ఆదేశాలతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా నాయకులు తలిపినేని స్వర్ణలత , పుట్టపర్తి వెంకటేశులు, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు నంజుండప్ప , ముత్యాలప్ప , రవి , లక్ష్మీదేవి , శాంతమ్మ , రామలక్ష్మి, శాతాంజ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కార్మిక కర్షక భవనాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న కార్మిక కర్షక నూతన భవనాన్ని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని గదులను పరిశీలించారు, పనులు సాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం త్వరితగతిని పూర్తి అవుతుందని సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తానని సిపిఎం నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్, సీనియర్ నాయకులు రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్, కార్మిక సంఘం నాయకులు ఎస్ వెంకటేష్, ఆఫీస్ కార్యదర్శి సిద్దు, స్వర్ణలత, కదిరి సిపిఎం నాయకులు జి ఎల్ నరసింహులు, ఎస్ఎఫ్ఐ బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : మంత్రి, ఎమ్మెల్యేలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూర


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు

ప్రజాశక్తి - కొత్త చెరువు

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రెండు కళ్ళ లాంటివని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్త చెరువు మండలం మీర్జాపురం పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని అన్నారు. అనంతరం మీర్జాపురం ఎస్సీ కాలనీ నుండి ఎస్టీ కాలనీ వరకు 13 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, పిఎస్ వెంగప్ప, కాంట్రాక్టు లక్ష్మీనారాయణ, ఎరువుల అంగడి నాయుడు తదితరులతో పాటు సర్పంచి రమణారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ శివ రంగ ప్రసాద్ , తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీవో బారంసాహెబ్, వ్యవసాయ అధికారి నటరాజు, ఏపీవో నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజుల్లోనే ఎవరు ఊహించని విధంగా మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'అనే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లోనే అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. మడకశిరను పారిశ్రామిక హబ్‌గా తయారు చేస్తామన్నారు. అనంతరం జమ్మలబండ, కేకే పాలెం గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతులు ఏర్పాటుచేసిన పొలంబడి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముత్తుకూరు పంచాయతీ మహిళా సంఘాలకు మంజూరైన దాదాపు 5 కోట్ల రూపాయల విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, తహశీల్దార్ రాంభూపాల్ రెడ్డి. రాష్ట్ర వక్కలి గల సాధికార సమితి అధ్యక్షులు పాండురంగప్ప, వెలుగు ఏపి నాగరాజు,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్,జిల్లా వీరశైవ సంఘం అధ్యక్షులు దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ వ్యాప్తంగా టిడిపి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదేశాలతో మున్సిపాలిటీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు వెంకటరమణమ్మ, శ్రీనివాసులు, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ రఫీ, అంబులెన్స్ రమేష్, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పుట్టపర్తిలో రోడ్లపై మురుగు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వీధిలో మురుగునీరు రోడ్డుపై పొంగిపొర్లుతోంది. మంగళవారం ఈ డ్రైనేజ్ నీరు పొంగి పొర్లడంతో ఆ వీధి చిన్నపాటి నదిని తలపించింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే ఈ వీధిలో డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుంటుందన్నారు. డ్రయినేజీ ఛాంబర్ వ్యర్థాలతో నిండిపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ సిబ్బందితో అక్కడికి వెళ్లి రోడ్డుపై నిలిచి ఉన్న మురుగునీరును తొలగించే కార్యక్రమం చేపట్టారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలో పాపసానపల్లి ఉన్నత పాఠశాలను ఎంఇఒ శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర - 2047 కార్యక్రమంలో భాగంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు నాగరాజు, సురేష్, వాణికుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన : కాంగ్రెస్

ప్రజాశక్తి - హిందూపురం

కలెక్టరేట్ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాలిబజావ్ అనే నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు డిసిసి అధ్యక్షులు ఎంహెచ్ ఇనాయతుల్లా తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షం 100 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. అందుకు నిరసనగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కమిటీ నిర్ణయం మేరకు పిసిసి చీఫ్ వైయస్ షర్మిల రెడ్డి ఆదేశానుసారం బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రమైన శ్రీ సత్య సాయి జిల్లా లోని కలెక్టరేట్ ఎదుట "తాలిబజావ్" పేరిట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - గోరంట్ల

విద్యార్థులు సేవాభావం ఏర్పరచుకోవాలని ఎస్వీపీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం అన్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవలో ముఖ్య పాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపకులు కవిత, శ్వేత, లక్ష్మి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని కే ఎచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన ఎన్ ఎస్ ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏసిఆర్. దివాకర్ రెడ్డి, మడకశిర రిటైర్డ్ ప్రిన్సిపల్ ఆర్ సుబ్బయ్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్జన దశలో జాతీయ సేవా పతకం ప్రతీ విద్యార్థి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తుందన్నారు. ఈసందర్భంగా 2021-2024 విద్యా సంవత్సరం విద్యార్థులకు ఎన్ ఎస్ ఎస్ సర్వీస్ సర్టిఫికెట్లు, ఎన్ ఎస్ ఎస్ స్పెషల్ క్యాంపు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.ఉత్తమ వాలంటీర్లకు మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ త్రివేణి, డాక్టర్ బి గోపాల్ నాయక్, డాక్టర్ ఎస్. షమీవుల్లా, డాక్టర్ ఎస్ చిట్టెమ్మ,కిరణ్ కుమార్, పావని తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎంపీ

ప్రజాశక్తి - రొద్దం

టిడిపి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ పార్థసారధి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా మంగళవారం మండలంలోని ఆర్. మరవపల్లి లో ఉన్న రొద్దం సచివాలయం 2లో కార్యక్రమం నిర్వహించారు. హిందూపురం ఎంపీ బి కె పార్థసారధి ఆధ్వర్యంలో లో సచివాలయం అధికారులు, నాయకులు కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, మురళి, ప టిడిపి జనరల్ సెక్రటరీ సత్యశేఖర్, శ్రీధర్, నరేష్, కదిరన్న, కల్లుకుంట హరీష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కోస్తున్న ఎంపీ పార్థసారధి

ఉత్తమ ప్రతిభతో గుర్తింపు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పుట్ బాల్ అసోసియేషన్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు జేవీ అనిల్ కుమార్ క్రీడాకారులకు సూచించారు. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో రెండు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పుట్ బాల్ పోటీలకు సీనియర్ మహిళా జట్టు మంగళవారం ఇక్కడ నుండి బయలుదేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పుట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో జరిగే సీనియర్ మహిళా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శేఖర్, మహమ్మద్ సలీమ్, వ్యాయామ ఉపాధ్యాయులు లోక్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. 50 వేలు విరాళం

పుట్టపర్తి అర్బన్ : వరద బాధితుల సహాయార్థం 50 వేల రూపాయలు చెక్కును స్థానికులు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ టిఎస్ చేతన్ కు అందజేశారు. మంగళవారం పట్టణంలోని గోవిందపేట సేవా సమితి సభ్యులు విశ్రాంత బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ రామప్ప, చౌక ధాన్యపు డిపో డీలర్ నాయుడు, సమాజ సేవకుడు శమీర్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయం అందజేశామన్నారు. చెక్కు అందించిన వారిని కలెక్టర్ అభినందించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని రాష్ట్ర చేనేత ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం నిడిమామిడి పంచాయతీ లో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నిడి మామిడి గ్రామంలో వరి సాగుచేసిన వెంకట రాముడు పొలాన్ని మంత్రి సవితమ్మ,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు డ్రిప్పులను రాయితీతో అందిస్తోందని పేర్కొన్నారు.పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ రైతులు బాగుండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడిఎ సుబ్బారావు, ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ అనుపమ,వ్యవసాయ అధికారులు వెంకట బ్రహ్మం, స్థానిక టిడిపి నాయకులు విజయ కుమార్ , బుగ్గపల్లి నాగరాజు , శ్రీరామ్ నాయక్ , శ్రీరామ్ రెడ్డి, నిడిమామిడి అక్రమ భాష, మెహరా లీ,కొట్లపల్లి రామయ్య, నరసింహప్ప పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థి చదువుతో పాటు సేవాభావాన్ని అలవరుచుకోవాలని దీనికోసమే ఎన్ఎస్ఎస్‌ను కళాశాలలో ప్రారంభించామని సప్తగిరి కళాశాల ఎఒ గంగిరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజునాథ్, ప్రోగ్రాం అధికారులు ఎస్ జి ప్రకాష్, టి నాగేంద్రలు, జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. అదే విధంగా ఎస్ డి జి ఎస్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జె ఎస్ వి ఎస్ ప్రసాద్, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్ర కుమార్ లు జాతీయ సేవా పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రాజన్న, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఒకే అధికారి..!

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని ఎం. కొత్తపల్లి సచివాలయంలో మంగళవారం కేవలం ఒకే ఒక్క అధికారి కన్పించాడు. సచివాలయంలో దాదాపు పది మంది సిబ్బంది ఉండగా అందులో నాలుగు గంటలకే సచివాలయంలో ఒక రైతు భరోసా కేంద్రం అధికారి గోవర్ధన్ తప్ప ఎవరూ లేరు. ఈ విషయం పై పంచాయితీ కార్యదర్శిని ఫోన్లో వివరణ కోరగా సచివాలయం లో ఎవరు ఉంటే వారు ఉన్నట్లు రాసుకోండి అని సమాధానం ఇచ్చారు. సచివాలయ అధికారులు సమయ పాలన లేకుండా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సచివాలయంలో ఉన్న ఒకే ఒక్క అధికారి

డిగ్రీ కళాశాల కమిటీ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ రావడం చాలా సంతోషమని, కమిటీ సభ్యుల కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందని హర్షం వ్యక్తం చేస్తూ కళాశాల అధ్యాపకులు కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా అత్యున్నత బృందం కళాశాలకు విచ్చేసి కళాశాల యొక్క పురోగతిని తెలుసుకొని, నివేదికను నేషనల్ న్యాక్ సంస్థకు అందజేయడం జరిగిందని అధ్యాపకులు తెలిపారు. భవిష్యత్తులో మరింత పురోగతి సాధించి రాష్ట్రంలోనే అన్ని కళాశాలకు ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం ఆధ్వర్యంలో మాజీ మునిసిపల్ ఛైర్మన్ బిఎస్ విద్యా సాగర్‌ను, మునిసిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డిని, కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, అధ్యాపకులు పాల్గొన్నారు.